# అదును దాటుతున్నా.. అందని సాయం

- రెండేళ్లుగా రైతులను ఊరిస్తున్న 'అన్నదాత సుఖీభవ'
- పెట్టుబడి సాయం లేక రైతుల ఇబ్బందులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏడాది అందిన నగదు
- 'అన్నదాత సుఖీభవ' కోసం రైతుల ఎదురుచూపు


ఇబ్రహీంపట్నంలోని మండల వ్యవసాయ శాఖ కార్యాలయ భవనం

**ఇబ్రహీంపట్నం:** గత రెండేళ్లుగా అన్నదాత సుఖీభవ సొమ్ముల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా అన్నదాత సుఖీభవ పథకానికి నిధులు విడుదల చేయకపోవడంతో రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ అమలు చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో నిధులు విడుదల అయితే పెట్టుబడి సాయంగా ఉపయోగపడుతుందని ఎదురుచూస్తున్న రైతులకు గత ఏడాది నిరాశే మిగిలింది. రబీ పూర్తి చేసి ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో నిమగ్నమైనా ఇంతవరకు పథకం తాలూకా డబ్బులు అకౌంట్లలో పడకపోవడంతో కూటమి ప్రభుత్వ నిర్వాకంపై రైతుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ఏడాది, ఈ ఏడాది కలిపి మొత్తం రూ.40 వేలు మూడు విడతలుగా అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేస్తారని మండలంలోని సుమారు 3,600 మంది రైతులు ఎదురు చూస్తున్నారు. గత నెల 20న నగదు జమ అవుతుందని ప్రకటించినా, నేటికీ అమలు చేయకుండా అర్జీలు కోరే స్థితిలోనే ఉన్నారు.

**అమలు చేయకుండా ఏడాది గడిపేశారు..**

ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి నేతలు అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తామని హామీ ఇచ్చారు. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసింది. పీఎం కిసాన్ యోజనలో రూ.6 వేలు, అన్నదాత సుఖీభవ పథకంలో రూ.14 వేలు మొత్తం రూ.20 వేలు మూడు విడతలుగా రైతులకు జమ చేయాల్సి ఉంది. గత ఏడాది జూలై, ఆగస్టులో నగదు జమ జేస్తారని రైతులు ఎదురు చూశారు. అప్పట్లో కూటమి పాలకులు రైతులకు మొండిచేయి చూపారు. రెండో ఏడాదిలో ఈసారి కూడా ఇంతవరకు డబ్బులు వేయకపోవడంతో రైతులు మండిపడుతున్నారు. పెట్టుబడి సాయంగా ఉపయోగపడే పథకం నిధులు అందుబాటులోకి రాకపోగా ఇంకా రబీలో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం తాలూకా డబ్బులు కూడా జమ కాలేదు. దీంతో వ్యవసాయం చేయడానికి అప్పులు చేయాల్సి వస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

**గత ప్రభుత్వంలో సకాలంలో అకౌంట్లలోకి నిధులు..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ రైతు భరోసాను రైతులకు పెట్టుబడి సాయంగా ఉపయోగ పడాలనే ఉద్దేశ్యంతో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను ఎంపిక చేశారు. అర్హులైన ప్రతి రైతుకు పథకం అందేలా చర్యలు తీసుకున్నారు. కేంద్రం నిధులు పీఎం కిసాన్‌తో కలిపి ఏడాదికి రూ.13,500 చొప్పున ముందుగా చెప్పిన తేదీ ప్రకారం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. రైతులు పంట సాగుకు అప్పులు చేసే పరిస్థితి లేకుండా డబ్బులు సద్వినియోగం చేసుకునే వారు. ఇబ్రహీంపట్నం మండలంలో గత నాలుగేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ. 6 కోట్ల 41 లక్షల 79 వేలను రైతుల ఖాతాలకు జమచేసింది. కూటమి నేతలు ఆ పథకానికి అన్నదాత సుఖీభవగా పేరు మార్చి రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చి గత ఏడాది ఎగ్గొట్టారు. ఈ ఏడాది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు ప్రతి ఏడాది డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ కాగానే రైతులు హర్షం వ్యక్తం చేసేవారు. నేడు రైతులను పట్టించుకోకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రెండేళ్లుగా సుఖీభవ నగదు ఇవ్వలేదు



అన్నదాత సుఖీభవ పథకంలో భాగంగా రూ. 20 వేలు ఏడాదికి ఇస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కానీ రెండేళ్లలో ఒక్కసారి కూడా డబ్బులు వేయలేదు. రైతులను ఆదుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం దారుణం. గత ఏడాది డబ్బులు ఇవ్వలేక పోయారు. ఈ ఏడాదైనా డబ్బులు వేస్తే పంటలకు ఉపయోగించుకుంటాం.

– జొన్నలగడ్డ సాంబశివరావు, రైతు, మూలపాడు

### కూటమి ప్రభుత్వం విఫలం



రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కూడా కల్పించలేకపోతోంది. గత ఏడాది రైతు భరోసా నగదు రైతులకు జమ చేయలేదు. ఈ ఏడాది కూడా రేపు, మాపు అని ఊరిస్తున్నారు. సకాలంలో రైతులకు అన్నదాత సుఖీభవ నగదు జమ చేయాలి.

– సీహెచ్ వేణుగోపాల్, జిల్లా రైతు సమైక్య సంఘం నాయకుడు

## భక్తిశ్రద్ధలతో కోటి సంపూర్ణ భగవద్గీత పారాయణం


భగవద్గీత పారాయణలో పాల్గొన్న మహిళలు

**నూజివీడు:** స్థానిక గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో శనివారం సంపూర్ణ భగవద్గీత పారాయణ కార్యక్రమం నిర్వహించారు. భగవద్గీత ఉపాధ్యాయిని మాడుగుల రమ్య మాట్లాడుతూ లోక కల్యాణార్థం కోటి సంపూర్ణ భగవద్గీత మహా యజ్ఞం తలపెట్టామని చెప్పారు. శనివారం ఉదయం 8 నుంచి ఆదివారం ఉదయం 8 గంటల వరకు నిర్విరామంగా సంపూర్ణ భగవద్గీత పారాయణం చేస్తామన్నారు. ఈ పారాయణలో నూజివీడు, మైలవరం, రెడ్డిగూడెం, విజయవాడ, భీమవరం, సత్తుపల్లి ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొన్నారని చెప్పారు. భగవద్గీతలోని 700 శ్లోకాలను చిన్నారులు కంఠస్థం చేసి పోటీలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించాలని సూచించారు. గత ఏడాది 60 మందికి ఈ పోటీల్లో గోల్డ్ మెడల్స్ లభించాయని చెప్పారు. భగవద్గీత పారాయణ జూన్ 6వ తేదీన శ్రీ గణపతి సచ్చిదానంద పుట్టినరోజున ప్రారంభించామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్ లైన్‌లలో నిర్వహిస్తున్న ఈ పారాయణం మొత్తంగా పరిగణనలోకి తీసుకుని కోటి సంపూర్ణ భగవద్గీత మహా యజ్ఞం విజయవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. భగవద్గీత శ్లోకాలను చిన్నారులు కంఠస్థం చేస్తే గోల్డ్ మెడల్స్ ఇస్తున్నామన్నారు.

## ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన



తిరువూరు నగర పంచాయతీ ఎదుట చెవిలో పువ్వులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

**తిరువూరు:** తమ డిమాండ్ల సాధనకై శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మె చేపడుతున్నట్లు తిరువూరు నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికులు తెలిపారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయం ఎదుట చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన తెలిపిన కార్మికులు నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ప్రకటించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరు చేయాలని, జీఓ నం 36 అమలు చేయాలని కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నామని చెప్పారు. సీఐటీయూ మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

**సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె**

**కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెకు సమాయత్తమయ్యారని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఎం.మహేష్ అన్నారు. కొండపల్లి మున్సిపాల్టీ డంపింగ్ యార్డ్‌లో ఇంజినీరింగ్ కార్మికులతో కలిసి సమ్మెలో చేపట్టాల్సిన విధివిధానాలపై శనివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలన్నారు. ప్రమాద భీమాతో పాటు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయని పక్షంలో శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెబాట పడతారన్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు సమ్మెకు సహకరించాలని కోరారు.

## క్లుప్తంగా

### వామ్మో..వానరాలు



**ఆగిరిపల్లి:** ఆగిరిపల్లిలో వానరాలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో శోభనాచలుడి కొండకే పరిమితమైన కోతులు ఇప్పుడు గ్రామంలోనూ అధికంగా సంచరిస్తున్నాయి. వీటి బెడద గ్రామంలోనే కాక చుట్టుపక్కల గ్రామాలకు కూడా పాకింది. కోతులు ఇళ్లల్లోకి చొరబడి ఏ వస్తువు కనబడితే ఆ వస్తువును ఎత్తుకుపోతున్నాయి. మనుషులు కనబడితే వారిపై దాడి చేస్తున్నాయి. కోతుల దాడుల్లో గాయపడి అనేకమంది ఆస్పత్రి పాలయ్యారు. ప్రధాన రహదారిలోని కిరాణా దుకాణదారులను కూడా ఇవి వదలడం లేదు. దుకాణం ముందు ఉంచిన తినుబండారాలు, విత్తనాల సంచులతో పాటు, అరటికాయల దుకాణాల వద్ద ఉన్న అరటి గెలలు, ఇతర పండ్లను ఎత్తుకెళుతున్నాయి. వీటిని ఎలాగైనా వదిలించుకుందామని కొంతమంది కొండముచ్చులను పెంచితే వాటి మీద కూడా దాడి చేసిన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రక్షించాలని కోరుతున్నారు.

### దోమల నివారణ మందు పిచికారీ



**చాట్రాయి:** మండలంలోని చనుబండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం దోమల నివారణకు ఎబేట్ మందును పిచికారీ చేశారు. గ్రామంలోని అన్ని కాలనీల్లో మురుగు నీరు నిల్వ ఉన్న ప్రదేశాలు, డ్రెయినేజీల్లో ఎబేట్ మందును పిచికారీ చేసి స్థానికులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విస్సంపల్లి జ్యోతి, పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ సోమశేఖర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### గంజాయి విక్రేతల అరెస్ట్




**తిరువూరు:** స్థానిక కోకిలంపాడు రోడ్డులోని మినీ స్టేడియం ఎదురుగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను తిరువూరు పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన కథనం ప్రకారం.. యువకుల వద్ద గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. తిరువూరు సుందరయ్య కాలనీకి చెందిన గుంజ వెంకటేశ్వరరావు, మొగిలిపువ్వు ఆనందకుమార్, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన గంధసిరి ఉపేంద్ర, రామన్నపాలెంకు చెందిన కంభంపాటి సింహాద్రిని అరెస్ట్ చేసి వారి నుంచి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. దాడిలో తిరువూరు తహసీల్దార్ ఉదయభాస్కర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

### 15న ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ



**తిరువూరు:** ముఠా వర్కర్స్ యూనియన్ ఎన్టీఆర్ జిల్లా మహాసభ ఈ నెల 15న తిరువూరులో జరుగుతుందని యూనియన్ నాయకులు ఎస్వీ భద్రం, బి. వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక చీరాల సెంటర్‌లో మహాసభ ప్రచార కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సుందరయ్య భవన్‌లో జరిగే మహాసభలో ముఠా కార్మికుల హక్కుల సమస్యలపై సమగ్ర చర్చ జరుగుతుందని, వారి హక్కుల పరిరక్షణకు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. జిల్లాలోని ముఠా వర్కర్లు ఈ మహాసభకు తరలి రావాలని కోరారు. సీఐటీయూ, ముఠా వర్కర్స్ యూనియన్ల నాయకులు ఆకుల రవి, బాబు, మరకాల ఇస్రాయేలు, ఆకుల రామారావు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

### సహస్ర దీపాలంకరణ సేవ



**తిరువూరు:** స్థానిక పాత తిరువూరులోని వేంకటాచలస్వామి దేవస్థానంలో శనివారం శ్రావణ నక్షత్ర సందర్భంగా స్వామి వారికి సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు దేవయాజనం వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో వేంకటాచల స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సహస్ర దీపాలంకరణ చేశారు.

## మత్తు పదార్థాలు కలపకుండా కల్లు విక్రయించాలి

నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య


కల్లుగీత సొసైటీల అధ్యక్షులతో సమావేశమైన ఎక్సైజ్ సీఐ మస్తానయ్య

**నూజివీడు:** కల్లులో ఎలాంటి మత్తు పదార్థాలు కలపకుండా విక్రయించాలని నూజివీడు ఎక్సైజ్ సీఐ ఎ.మస్తానయ్య కల్లు గీత కార్మికులకు సూచించారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం ఆయన కల్లు గీత సొసైటీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చొప్పరమెట్ల, గోపవరం, ఈ సీతారాంపురం సొసైటీల్లో కల్లు శాంపిల్స్ తీశామని, వాటిని పరీక్షల నిమిత్తం కాకినాడలోని కెమికల్ ఆఫీసుకు పంపిస్తామని చెప్పారు. ఈ పరీక్షల్లో కల్లులో వేరే మత్తు పదార్థాలు కలిసినట్లు తేలితే ఆయా సొసైటీలను రద్దు చేస్తామని మస్తానయ్య హెచ్చరించారు.

## ఈలప్రోలు రైల్వే ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

**రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ):** రాయనపాడు–కొండపల్లి మధ్యలోని రైల్వే లెవల్ క్రాసింగ్ గేటు నెంబర్ 140ని రెండు రోజుల పాటు తాత్కలికంగా మూసివేయనున్నట్లు విజయవాడ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌సీ గేటు వద్ద బీటీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టనుండటంతో ఈ నెల 14వ తేదీ ఉదయం 8 నుంచి 15వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు ఎల్‌సీ గేటును మూసివేయనున్నారు. ఈ గేటు మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## పుష్కరఘాట్ వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేయరూ..


నదిలోని సాలాగ్రామ నరసింహస్వామి

**వేదాద్రి(జగ్గయ్యపేట):** ప్రముఖ పుణ్యక్షేత్రం యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ పుష్కరఘాట్ వద్ద సూచిక బోర్డులు లేకపోవడంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఘాట్ సమీపంలోని నదిలో ఉన్న సాలాగ్రామ నరసింహస్వామి వద్ద లోతు ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ చోటుచేసుకున్న ప్రమాదాల కారణంగా గత ఆరేళ్లలో నలుగురు వ్యక్తులు మృతిచెందగా, మరికొంత మందిని అక్కడే అందుబాటులో ఉన్నవారు కాపాడగలిగారు. 2013లో విజయనగరం జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే, స్వామివారి దర్శనానికి వచ్చి నదిలో ఉన్న నరసింహస్వామిని దర్శించుకుని వస్తూ ఒక్కసారిగా మునిగిపోయారు. దీంతో ఒడ్డునున్న గజ్‌మెన్ ఆ ఎమ్మెల్యేను కాపాడి ఒడ్డుకు తీసుకురావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. గతంలో సూచికబోర్డుల ఏర్పాటుతో పాటు నదిలో లోతు ఎక్కువగా ఉందంటూ మైకు ప్రచారాలు చేసే వారని, ప్రస్తుతం మైకు ప్రచారాలు కూడా లేవని భక్తులు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి ఘాట్ వద్ద సూచిక బోర్డులు, మైకు ప్రచారం ఏర్పాటుతోపాటు రక్షణ చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

## బిల్లుల భారం తగ్గించాలని సంతకాల సేకరణ


సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

**నందిగామటౌన్:** విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు, తీరా అధికారంలోకి వచ్చాక విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట కల్యాణ్ మండిపడ్డారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను తొలగించాలని కోరుతూ పట్టణంలోని 11,12 వార్డుల్లో సీపీఎం నాయకులు శనివారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ బిల్లులను విపరీతంగా పెంచి ప్రజలపై రూ.15,485 కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని మోపిందన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని ప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటను తప్పి స్మార్ట్‌మీటర్‌లను బిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కర్రి వెంకటేశ్వరరావు, గోపీ నాయక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన శాకంబరి ఉత్సవాలు



**నందిగామ రూరల్:** మండలంలోని అంబారుపేటలో వేంచేసి ఉన్న సత్యమ్మ అమ్మవారి ఆలయంలో మూడురోజులుగా నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాలు ముగిశాయి. ఆలయ అర్చకులు నందిగం సుబ్బారావు శర్మ, కోటేశ్వర శర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి శనివారం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి శాకంబరి అలంకరణకు వినియోగించిన ఆకు, కూరగాయలను వినియోగించి 4,500 మందికి నిర్వహించిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు ప్రారంభించారు. శాకంబరీ ఉత్సవాలకు సహాయ సహకారాలు అందించి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఇన్‌చార్జ్ ఈఓ పవన్‌కల్యాణ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మంచాల మాధవరావు, చంద్రు వాసు, శ్రీనివాసరావు, శివసాయి సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గుంతలమయం


బూరుగుగూడెం రోడ్డులో వికాస్ స్కూల్ వద్ద గుంతలు


చాట్రాయి నుంచి బూరుగుగూడెం వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు


పూర్తిగా ధ్వంసమైన తిరువూరు మండలం కోకిలంపాడు ఆర్ అండ్ బీ రోడ్డు


కోకిలంపాడు రోడ్డులో భారీ గుంతలు

**చాట్రాయి:** మండలంలోని రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటిల్లో నీరు చేరి ప్రమాదకరంగా మారాయి. కొద్దిపాటి వర్షం కురిస్తే చాలు ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి ఏది గుంతో, ఏది రోడ్డో గుర్తించేలోపే వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. గుంతలు లేని రోడ్లే లక్ష్యమని ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వానికి రోడ్ల దుస్థితి కనిపించడంలేదా అని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాట్రాయి నుంచి బూరుగుగూడెం రోడ్డుకు ఇటీవల మరమ్మతులు చేశారు. ఈ పనుల్లో నాణ్యత కొరవడటంతో ఈ రోడ్డుపై మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. వీటిలో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో పీహెచ్‌సీకి వెళ్లడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. చాట్రాయి మండలంలోని పలు రోడ్ల దుస్థితి ఇలాగే ఉండటంతో ప్రజలు ప్రయాణానికి నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లపై గుంతలు పూడ్పించాలని ప్రజలు కోరుతున్నారు.

**అడుగడుగునా గుంతలు.. నిత్యం ప్రమాదాలు..**

**తిరువూరురూరల్:** తిరువూరు మండలం కోకిలంపాడు వెళ్లే ఆర్ అండ్ బీ రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. కోకిలంపాడుతో పాటు ఖమ్మం జిల్లాలోని గణేశన్‌పాడు, అడసర్లపాడు తదితర గ్రామాలకు ఈ రహదారిపైనే రాకపోకలు సాగిస్తారు. గుంతలతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంపై ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరువూరు నుంచి కోకిలంపాడుకు రాకపోకలు సాగించే కళాశాలలు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఐదు కిలోమీటర్లు చుట్టూ తిరిగి తిరువూరు చేరుకోవలసి వస్తోందని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం



**మైలవరం:** తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని చంద్రాల గ్రామంలో ఉపాధ్యాయులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.గోపాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు విద్యా బోధన చేస్తారని, విద్యార్థులు భోజనానికి ఇబ్బందులు పడకుండా మధ్యాహ్నం ఉచిత భోజనం ఉంటుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తల్లికి వందనంతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు, ఉపాధ్యాయులు ఇందిర, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## బెజవాడ దుర్గమ్మకు సారె సమర్పణ


దుర్గమ్మకు సారె సమర్పించేందుకు వెళుతున్న హరిశ్చంద్రపురం భక్తులు

**కాట్రేనిపాడు:** బెజవాడ కనక దుర్గమ్మ వారికి భక్తులు ఆషాఢ సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్ గోగినేని కృష్ణభారతి ఆధ్వర్యంలో కాట్రేనిపాడు శివారు హరిశ్చంద్రపురానికి చెందిన పలువురు మహిళలు శనివారం విజయవాడకు వెళ్లి బెజవాడ కనక దుర్గమ్మకు ఆషాఢ సారె, పసుపు కుంకుమలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ పరమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌లో నమోదు చేయించుకోవాలి

**ముసునూరు:** అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్ పథకానికి అర్హులైన వారి పేర్లు జాబితాలో లేకపోతే గ్రీవెన్స్ పోర్టల్‌లో వెంటనే నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి పేర్కొన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకానికి మండలంలో 8,096 మంది రైతులను లబ్ధిదారులుగా గుర్తించామని చెప్పారు. వీరికి పీఎం కిసాన్ ద్వారా రూ.2,000, అన్నదాత సుఖీభవ ద్వారా రూ.5,000 బ్యాంకు ఖాతాలకు జమవుతాయన్నారు. అర్హులైన వారి భూమి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం, ఆధార్ అనుసంధానం జరిగి, జాబితాలో పేరు లేనివారు ఈనెల 13వ తేదీ లోగా రైతు సేవా కేంద్రాల్లో గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని సూచించారు.

## మైలవరం సొసైటీ అధ్యక్షుడిగా కరెడ్ల



**మైలవరం:** మైలవరం పీఏసీఎస్ అధ్యక్షుడిగా కరెడ్ల వెంకట నారాయణ నియమితులయ్యారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆశీస్సులతో టీడీపీకి చెందిన వెంకట నారాయణ నియామకం జరిగింది. ఆయనను పలువురు నాయకులు, గ్రామస్తులు అభినందించారు.

## 'పంటల బీమా'కు దరఖాస్తు చేసుకోవాలి

**నూజివీడు:** ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పంటల బీమా పథకాన్ని రుణం పొందిన, పొందని రైతులు, కౌలుదారులు వినియోగించుకోవచ్చని ఏడీఏ ఆలూరు చాముండేశ్వరి శనివారం తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులు ఆర్థిక సాయం పొందవచ్చన్నారు. వరి పంటకు గ్రామం యూనిట్‌గా బీమా వర్తిస్తుందని చెప్పారు. వరి పంటకు రూ.850, మినుముకు రూ.300, పత్తికి రూ.1,900, నిమ్మకు రూ.2,500 చొప్పున రైతులు ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించాలన్నారు. మినుముకు మాత్రం ఈనెల 31వ తేదీ లోగా చెల్లించాలని చెప్పారు. రుణం పొందిన రైతులకు బ్యాంకులోనే ప్రీమియంను కట్టించుకుంటారని, రుణం తీసుకోని రైతులు పథకంలో నమోదు చేయడానికి అవసరమైన పత్రాలు తీసుకొని రైతు సేవా కేంద్రం సహాయకులను సంప్రదించాలని చెప్పారు.